





ఆదివారం 26 జులై 2026 | www.prajajyothinews.com | పేజీలు :10













## ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండానే..

# విశాల్‌మార్ట్ ప్రారంభమా..?

- జి ప్లస్-4 వాణిజ్య భవనంపై నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలు
- సెల్లార్‌లో లోపాలు
- సెట్‌బ్యాక్‌లపై అభ్యంతరాలు
- భవన యజమానికి నోటీసులు జారీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ వెల్లడి దొమ్మటి రాజేష్
- ట్రాఫిక్ సమస్యలపై స్థానికుల ఆందోళన




పెద్దపల్లి ప్రతినిధి జూలై 24 ప్రజా జ్యోతి; పెద్దపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై నిర్మించిన ఓ జి ప్లస్-4 వాణిజ్య భవనంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) లేకుండానే ప్రముఖ రిటైల్ సంస్థ విశాల్ మార్ట్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయనే అంశం చర్చనీయాంశంగా మారింది. భవన నిర్మాణంలో మున్సిపల్ నిబంధనలు పాటించలేదని, సెల్లార్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని, భవనం చుట్టూ తప్పని సరిగా ఉండాల్సిన సెట్‌బ్యాక్‌లు లేకుండానే నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై విచారణ చేపట్టి, అవసరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.రాజీవ్ రహదారిని ఆనుకుని కమాన్ నుంచి జెండా చౌరస్తాకు వెళ్లే ప్రధాన మార్గంలో సుమారు 1,558 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, 14.9 మీటర్ల ఎత్తుతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో విశాల్ మార్ట్ ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వివరాలు 7లో..

## వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి మరో రూ.99.40 కోట్లు..

6లో..



# వేములవాడలో ఘనంగా ప్రారంభమైన విశ్వ హిందూ పరిషత్ ప్రాంత వర్షారంభ సమావేశాలు



వేములవాడ,జులై,25:ప్రజాజ్యోతి. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే రెండు ప్రాంతీయ సమావేశాలలో భాగంగా ప్రాంత వర్షారంభ సమావేశాలు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సమావేశాలకు ముందు గోమాత పూజనుభక్తిశ్రద్ధల తోనిర్వహిఁచారు.అనంతరంవేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమం నిర్వహించి, భారతమాత చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి సమావేశాలను అధికారికంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వ హిందూ పరిషత్ జాతీయ సంయుక్త కార్యదర్శి కోటేశ్వర శర్మ , క్షేత్ర ప్రముఖ్,గుమ్మల సత్యం , ప్రాంత అధ్యక్షులు నరసింహమూర్తి , ప్రాంత కార్యదర్శి లక్ష్మీనారాయణ , జిల్లా అధ్యక్షులు ఇనుగంటి. మధుసూదన్ రావు , తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర, జిల్లా స్థాయి బాధ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శులుగడప. కిషోర్ రావు, నాగుల. రాములు గౌడ్, వేములవాడ పట్టణ కమిటీ అధ్యక్షులు శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షులు చేకూర్తి నవీన్, తోట. అజయ్, సభ్యులు రాజేష్, బాలకృష్ణ పాల్గొన్నారు. అలాగే కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ప్రపంచంలో అత్యంత ప్రాచీనమైన, గొప్ప కుటుంబ వ్యవస్థ హిందూ కుటుంబ వ్యవస్థేనని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం కుటుంబ విలువలు, పరస్పర గౌరవం, ధార్మిక జీవన విధానానికి ప్రతీక అని వివరించారు.గోమాత విశిష్టతను వివరిస్తూ, భారతీయ సంస్కృతిలో గోమాతకు ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక ప్రాధాన్యతను ప్రతి హిందువు తెలుసుకొని గో సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా హిందూ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చిస్తూ, మతమార్పిడులు, లవ్ జిహాద్ వంటి అంశాలపై సమాజంలో అవగాహన పెంపొందించి, చట్టబద్ధమైన మార్గాల్లోవాటినిఎదుర్కోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. హిందూ దేవాలయాల పరిరక్షణ, హిందూ ధార్మిక సంప్రదాయాల పరిరక్షణ, సంస్కృతి పరిరక్షణ, సేవా కార్యక్రమాల విస్తరణ, హిందూ సంఘాల బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలనిపిలుపునిచ్చారు.ప్రాంత వర్షారంభ సమావేశాల్లో రాబోయే కార్యాచరణ, సంస్థ విస్తరణ, సేవా కార్యక్రమాలు, ధర్మరక్షణ, సామాజిక సమరసత, యువతలో జాతీయ భావన పెంపొందించే అంశాలపై విస్తృతంగాచర్చలు జరిగాయి.ఈ ప్రాంత వర్షారంభ సమావేశాలు విజయవంతంగాప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు.

## పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఘనంగా కార్గిల్ విజయదినోత్సవ వేడుకలు



కరీంనగర్ బ్యూరో,జులై 25( ప్రజాజ్యోతి ) కార్గిల్ విజయదినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో దేశభక్తి ఉట్టిపడేలా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్నల్ ఎ.కె. జయంత, సుబేదార్ మేజర్ జాంగ్‌బజ్ ఖాన్, సుబేదార్ విజయ్ కుమార్, హవల్దార్ ప్రతాప్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు విద్యార్థులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు, ఆలపించిన దేశభక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం సైనిక అధికారులను ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా కల్నల్ ఎ.కె. జయంత మాట్లాడుతూ కార్గిల్ యుద్ధ వీరుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడం కూడా దేశసేవేనని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందాలని ఆకాంక్షించారు.పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు మాట్లాడుతూ కార్గిల్ అమరవీరులకు ఘన నివాళు లర్పించారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుని, మంచిగా చదువుకుని భవిష్యత్తులో దేశ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. సైనికులు దేశ రక్షణ కోసం చేస్తున్న సేవకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం ద్వారా గౌరవం చాటాలని అన్నారు.కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడికి గంగుల ఆశీస్సులు

కరీంనగర్ రూరల్, జులై 25, (ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు సుంకిశాల సంపత్‌రావు తన జన్మదినం సందర్భంగా కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సంపత్‌రావుకు శాలువా కప్పి సన్మానించి మిఠాయిలు తినిపిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు,సంపత్‌రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని రాజకీయ రంగంలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు,ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంపత్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## మంత్రి హోదా పొందిన ఎమ్మెల్యే విజయ రమణారావుకు ఘన సన్మానం.



కాల్వ శ్రీరాంపూర్ జులై 25 (ప్రజా జ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అల్లం దేవేందర్. ముదిరాజు సంఘం అధ్యక్షుడు రానవేణ శ్రీనివాసు. పలువురితో కలిసి మంత్రి హోదా పొందిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావును. తన స్వగృహంలో శనివారం రోజున కలిసి. శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. హోదా కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి. సహకరించిన.ఇతర మంత్రులకు. వారు కృతజ్ఞతలు తెలిపారు. వీరు వెంట గోవర్ధన్. రవి. తదితరులు ఉన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి, యువత పోరాట విజయం

– సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య




కరీంనగర్ బ్యూరో, జులై 25 (ప్రజాజ్యోతి ) కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడారు.నీట్ పరీక్ష పత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, యువత పోరాట విజయమని అన్నారు. విద్యార్థుల ఐక్య పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచిందని పేర్కొన్నారు.అయితే రాజీనామాతో సరిపోదని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, ఎన్‌టీఏను రద్దు చేయాలని, నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.పేపర్ లీకేజీలపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవగాహన రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజా ఉద్యమం ముందు తప్పు చేసిన ఎంతటి వారైనా తలవంచక తప్పదని అన్నారు.ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, నాయకులు వర్ల వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, నరేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో మహిళా ఆత్మహత్యాయత్నం

### సకాలంలో స్పందించిన కరీంనగర్ రూరల్ పోలీసులు



కరీంనగర్ క్రైం, జూలై 25, (ప్రజాజ్యోతి): కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వివాహితను కరీంనగర్ రూరల్ పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు.కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడు గ్రామానికి చెందిన నేతి మానస (23) శనివారం ఉదయం కుటుంబ సమస్యలతో తన ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డికి సమాచారం అందింది.వెంటనే ఆయన బ్లూ కోల్ట్ సిబ్బంది కానిస్టేబుల్ అఫ్జల్, హోంగార్డు ప్రసాద్‌లను సంఘటనా స్థలానికి పంపించారు.సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళ నిప్పంటించుకోకుండా అడ్డుకుని,ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించారు.అనంతరం కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు.మహిళకు చిన్నారి కుమార్తె ఉండటంతో పోలీసుల సకాల స్పందనతో ఓ కుటుంబం విషాదంలోకి వెళ్లకుండా నిలిచిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.మహిళ ప్రాణాలను కాపాడడంలో సమయస్ఫూర్తి ప్రదర్శించిన రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి, కానిస్టేబుల్ అఫ్జల్, హోంగార్డు ప్రసాద్‌లను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం,ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు .కుటుంబ సమస్యలు లేదా వ్యక్తిగత ఇబ్బందులు ఎదురైనప్పుడు ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా పోలీసులను సంప్రదించాలని కరీంనగర్ రూరల్ పోలీసులు ప్రజలకు సూచించారు.

# బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ తిరుమల్ బాబు కు ఘన సన్మానం

### శాలువా కప్పి సత్కరించిన ఎస్సై కే ప్రశాంత్ రెడ్డి



**కొనరావుపేట, జూలై.25(ప్రజాజ్యోతి)** కొనరావుపేట పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏ ఎస్ ఐ తిరుమల్ బాబు,సిద్దిపేటకు బదిలీ కాగా శనివారం నాడు ఘనంగా వీడ్కోలు పలికి,ఎస్సై కె ప్రశాంత్ రెడ్డి,ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సన్మానించి బొకే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. పోలీస్ శాఖలో ఆయన చేసిన సేవలను కొనియాడుతూ కొత్త విధి నిర్వహణ స్థానంలో ఇలాగే నిబద్ధతతో పనిచేసే మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: బీజేవైఎం డిమాండ్

పెద్దపల్లి ప్రతినిధి, జూలై 25 ప్రజా జ్యోతి; రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) డిమాండ్ చేసింది. శనివారం పెద్దపల్లి బీజేపీ జిల్లా కార్యాలయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్, రాష్ట్ర ఫీజు రీయింబర్స్‌మెంట్ కన్వీనర్ శరత్ చంద్ర, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీజేవైఎం పెద్దపల్లి జిల్లా కన్వీనర్ రామగిరి అఖిల్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి సుమారు రూ.15,000 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల



చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్‌తో పాటు బొడ్డుపల్లి శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, మంతెన కృష్ణ, మామిడిశెట్టి రాకేష్, బొల్లం అనిల్, రాజకుమార్, కొమ్ము రాజేందర్, దిలీప్, మధుకరన్, శివసాయి, కుక్క అంజి, కట్ట రోహిత్, అంజి, అనిల్, శ్రీరామ్, కృష్ణ, వినోద్, ఆంజనేయులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్ లో ప్రారంభమైన ఎంఆర్ఎఫ్ 'బాలాజీ టైర్ వరల్డ్' షోరూం

### -అత్యాధునిక పరికరాలతో వీల్ అలైన్‌మెంట్, బాలెన్సింగ్, టైర్ సేవల సర్వీస్ కేంద్రం



**కరీంనగర్ టౌన్ జూలై 25 (ప్రజా జ్యోతి )** నగరం లోని మంచిర్యాల చౌరస్తా సమీపం లో ఎంఆర్ఎఫ్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలాజీ టైర్ వరల్డ్ టైర్స్ & సర్వీస్ ఫ్రాంచైజీని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ దక్షిణ భారత విభాగీయ మేనేజర్ ఈశ్వర్ పి. ఇట్నాల్, షోరూం యజమాని కుమారస్వామి, జిల్లా మేనేజర్ జగదీశ్వర్ రావు, కరీంనగర్ ఇన్‌చార్జి మహేందర్ పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈశ్వర్ పి. ఇత్మల్ మాట్లాడుతూ, జగిత్యాలలో 2018లో మొదట కుమారస్వామి ప్రారంభించిన, బాలాజీ టైర్ వరల్డ్ విజయవంతంగా కొనసాగుతోందని, అదే విధంగా కరీంనగర్ కేంద్రం కూడా ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా ఎంఆర్ఎఫ్‌కు సుమారు 1,400 షోరూములు ఉన్నవి, ప్రతి ఆరు వేల కిలోమీటర్లకు ఒకసారి వీల్ అలైన్‌మెంట్ చేయించుకోవడం వల్ల టైర్ల జీవితకాలం సుమారు 25 శాతం పెరుగుతుందని సూచించారు.ఈ కేంద్రంలో దిగుమతి చేసిన అత్యాధునిక యంత్రాలతో వీల్ అలైన్‌మెంట్, వీల్ బాలెన్సింగ్, స్వయంచాలక టైర్ అమరిక, ట్యూబ్‌లెస్ టైర్ మరమ్మతులు, నైట్రోజన్ గాలి నింపే సేవలు అందుబాటులో ఉన్నాయి. వాహనాల సేవల సమయంలో వినియోగదారులు వాతానుకూలిత విశ్రాంతి మందిరంలో సౌకర్యవంతంగా వేచి ఉండే ఏర్పాట్లు చేశారు.చెన్నైలోని ఎంఆర్ఎఫ్ శిక్షణ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ పొందిన నిపుణుల సేవలు అందుబాటులో ఉండటం ఈ కేంద్రం ప్రత్యేకతగా నిలుస్తోంది. అలాగే జెడ్‌ఎల్‌ఎక్స్, పెర్ఫింజా వంటి ఎంఆర్ఎఫ్ నాణ్యమైన కారు రేడియల్ టైర్లతో పాటు ఆధునిక టైర్ సేవలను కరీంనగర్ వాహనదారులకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం లో షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ నియామకం



**చొప్పదండి, జూలై 25 ( ప్రజా జ్యోతి):** బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.బత్తుల లక్ష్మీనారాయణ గతంలో బీజేపీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, చొప్పదండి మండలం గుమ్లాపూర్ ఎంపీటీసీగా సేవలందించారు.ఈ సందర్భంగా బత్తుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో బిజెపి, ఎస్సీ మోర్చా బలోపేతానికి తనవంతు పూర్తి కృషి చేస్తానని తెలిపారు. కరీంనగర్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, అలాగేతన నియమాకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులందరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా ఫెర్టీ9కు అంతర్జాతీయ గుర్తింపు

**- ఫెర్టీ9 కరీంనగర్ కేంద్రం వైద్య నిపుణుడు డాక్టర్ బి.జి.బి. పిళ్లై**



కరీంనగర్ టౌన్ జులై 25( ప్రజా జ్యోతి ) నీడిల్-రహిత ఐవీఎఫ్ సేవలు, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశోధనలతో దంపతులకు ఆధునిక ఫెర్టిలిటీ చికిత్సలుప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్టీ9 కరీంనగర్ కేంద్రం వైద్య నిపుణుడు డాక్టర్ బి.జి.బి. పిళ్లై మాట్లాడుతూ, ఫెర్టీ9 క్లినికల్ బృందం ప్రపంచ ప్రఖ్యాత సదస్సుల్లో పరిశోధనా పత్రాలను సమర్పించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందిందని తెలిపారు.భారతదేశంలో సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో తెలంగాణలో అది 1.8, ఆంధ్రప్రదేశ్‌లో 1.7గా నమోదైందన్నారు. జీవనశైలి మార్పులు, మానసిక ఒత్తిడి, ఆలస్య వివాహాలు, ఉద్యోగ పరిస్థితులు, పురుషులు, మహిళల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. అయితే ప్రారంభ దశలోనే నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు, ఆధునిక చికిత్సలు తీసుకుంటే విజయావకాశాలు గణనీయంగా పెరుగుతాయని సూచించారు.ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా ఫెర్టీ9 తన 11 కేంద్రాల్లో నీడిల్-రహిత ఐవీఎఫ్ సేవలను ప్రారంభించిందని తెలిపారు. దీని వల్ల రోజువారీ ఇంజెక్షన్లతో కలిగే నొప్పి, ఆందోళన తగ్గుతాయని వివరించారు. అలాగే కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రజనన ఆరోగ్య పరిశోధనల ద్వారా ఐవీఎఫ్ విజయశాతాన్ని పెంచడంతో పాటు ఇంప్లాంటేషన్ వైఫల్యాలను తగ్గించే దిశగా సంస్థ కృషి చేస్తోందన్నారు .భవిష్యత్తులో ఇంప్లాంటేషన్ వైఫల్యాలు, గర్భస్రావాల నివారణకు ప్రత్యేక అత్యుత్తమ కేంద్రాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల దంపతులకు మరింత ఆధునిక ఫెర్టిలిటీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోని 11 ఫెర్టిలిటీ కేంద్రాల ద్వారా ఫెర్టీ9 సేవలు అందిస్తోందని, కరీంనగర్ కేంద్రం అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్యుల సేవలతో వేలాది మంది దంపతులకు తల్లిదండ్రులయ్యే ఆనందాన్ని అందిస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బొమ్మారెడ్డిపల్లిలో నర్సరీని పరిశీలించిన డీఎల్పీఓ దేవికాదేవి



ధర్మారం, జూలై 25(ప్రజా జ్యోతి న్యూస్):పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి గ్రామాన్ని జిల్లా స్థానిక పంచాయతీ అధికారి (డీఎల్పీఓ) దేవికాదేవి సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం,డంపింగ్ యార్డు,నర్సరీలను పరిశీలించి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు.గ్రామంలో అమలు చేస్తున్న 'జల సిరి' కార్యక్రమం ప్రాధాన్యతను వివరించిన ఆమె, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని తెలిపారు.అనంతరం నర్సరీలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజ్‌కుమార్ దార, పంచాయతీ కార్యదర్శి మానస, ఫీల్డ్ అసిస్టెంట్ భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించి న మేయర్



కరీంనగర్ కార్పొరేషన్, జులై 25(ప్రజాజ్యోతి ):- కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ మార్కెట్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను , ప్రజల వినియోగానికి అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఢ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.నూతనంగా నిర్మించనున్న కాశ్మీర్ గడ్డలోని రైతు మార్కెట్ లో మిగిలిపోయిన పనులను పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. వచ్చే ఆగస్టు నెలలో ఈ మార్కెట్‌ను ప్రారంభించేలా అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని వారు స్పష్టం చేశారు.అనంతరం గతంలో పద్మనగర్‌లో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్-వెజ్ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి గల అవకాశాలను పరిశీలించారు. ఈ మార్కెట్‌ను వినియోగంలోకి తేవడానికి ఏమేమి చర్యలు తీసుకోవాలనే దానిపై క్షేత్రస్థాయిలో విజిట్ చేసి సమీక్షించారు.ఈ కార్యక్రమంలో 61వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ అథీఫ్, పలువురు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

**: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**...రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి సమన్వయంతో చర్యలు చేపట్టాలి**

**..ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అలైన్‌మెంట్‌ను ఖరారు చేయాలని రైల్వే అధికారులకు సూచన**

**...రైల్వే, రెవెన్యూ అధికారులతో భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి, ప్రతినిధి జూలై-25: దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో చేపడుతున్న రైల్వే లైన్ల విస్తరణ, ఆధునీకరణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు తో కలిసి దక్షిణ మధ్య రైల్వే, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని ఓదెల, పెద్దపల్లి, రామగుండం, అంతర్గాం మండలాల్లో ప్రతిపాదిత రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు (=వాదీ), రోడ్డు అండర్ బ్రిడ్జిలు (=ఖదీ), ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు (ఖీదీ) నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ పురోగతిని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష" సమీక్షించారు. రైల్వే లెవల్ క్రాసింగ్‌ల ప్రస్తుత పరిస్థితి, భూసేకరణలో ఎదురవుతున్న అంశాలు, నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను రైల్వే, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రైల్వే అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు ఎలాంటి జాప్యం లేకుండా ప్రారంభించేందుకు అవసరమైన భూసేకరణను రెవెన్యూ అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజలకు కనీస ఇబ్బందులు కలగకుండా రైల్వే అధికారులు అలైన్‌మెంట్‌ను ఖరారు చేసి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో తలెత్తే సమస్యలను పరస్పర సహకారంతో వెంటనే పరిష్కరించి ప్రాజెక్టుల అమలుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లాలోని ఓదెల, పెద్దపల్లి, రామగుండం, అంతర్గాం మండలాల్లో ప్రతిపాదిత రైల్వే వంతెనలు, అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు కూడా దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ లు ఓదెల వనజ , పెద్దపల్లి రాజయ్య, అంతర్గాం, రామగుండం తహసీల్దార్లు, ఏడీ సర్వేయర్, సంబంధిత రెవెన్యూ దక్షిణ మధ్య రైల్వే భూసేకరణ నిపుణులు పి. దేవరాజు (సికింద్రాబాద్), సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు హరిహరాచారి (కాజీపేట్), ఓంప్రకాశ్ (రామగుండం), రైల్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పండుగ పూట పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ తనిఖీలా బీజేపీ అధికార ప్రతినిధి చొప్పదండి శ్రీనివాస్ రాజన్న సిరిసిల

ప్రతినిధి జూలై 25 (ప్రజాజ్యోతి ) తెలంగాణ తొలి పండుగ తొలి ఏకాదశి ప్రజలకు అత్యంత పవిత్రమైన, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన మహా పర్వదినం రోజున లక్షలాది మంది భక్తులు ఉపవాస దీక్షలు, ప్రత్యేక పూజలు, ఆలయ దర్శనాలు, కుటుంబ సభ్యులు మరియు బంధువులతో కలిసి భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకుంటారు. అలాంటి పవిత్రమైన రోజున ప్రజలు పూజా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న సమయంలో భారీ ఎత్తున కమ్యూనిటీ కాంటాక్ట్ పేరుతో తనిఖీలు నిర్వహించడం, వాహనాలను స్వాధీనం చేసుకోవడం, ప్రజలను మానసికంగా ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని ఒక ప్రకటనలో తెలియచేసారు శాంతి భద్రతల పరిరక్షణ పోలీసు శాఖ బాధ్యతే. అయితే అలాంటి కార్యక్రమాలను ప్రజల మత విశ్వాసాలు, పండుగల పవిత్రత మరియు సామాజిక పరిస్థితులను గౌరవించే విధంగా నిర్వహించాలి. ఇలాంటి చర్యలను ఏ సాధారణ రోజునైనా చేపట్టే అవకాశం ఉన్నప్పుడు, ప్రత్యేకంగా తొలి ఏకాదశి రోజున నిర్వహించడం సరైన నిర్ణయం కాదు. ప్రజల మనోభావాలను గౌరవించడం ప్రతి ప్రభుత్వ వ్యవస్థ బాధ్యత. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను పండుగ రోజులకు దూరంగా నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసు శాఖను కోరారు

## నీలకంఠ చెరువు మత్తడి నుండి .దేవన్న కుంట వరకు ముండ్ల పొదలు తొలగింపు.

**బిజెపి మండల ఉపాధ్యక్షుడు. పిల్లల మర్రి రాములు.**




కాల్వ శ్రీరాంపూర్ జూలై 25 (ప్రజా జ్యోతి)

కాలువ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని. నీలకంఠ చెరువు మత్తడి నుండి. దేవన్న కుంట వరకు. రోడ్డుకు ఇరువైపులో గల ముండ్ల పొదలను పొక్కిలింతో సొంత డబ్బులతో బిజెపి మండల ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి రాములు. శనివారం రోజున తొలగింప చేశారు. దీనితో రెండు చెరువుల కింద గల రైతులకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. రైతులు ఆయనను అభినందించారు.

## డాక్టర్ రేగొండ రాజేష్ జన్మదిన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



(కోరుట్ల రూరల్, ప్రజా జ్యోతి, జూలై 25)

కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామంలో డాక్టర్ రాజేష్ రేగొండ జన్మదిన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కల్లూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి లోనే కాకుండా సమాజసేవలోను ఆయన ముందుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, కల్లూరు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్నేని రమేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో ఘనంగా ముగిసిన శ్రీ పార్వతీ రాజరాజేశ్వర అఖిల భారత వేద--శాస్త్ర--స్మార్త--ఆగమ విద్వత్ సదస్సు -- వేద సంస్కృతి పరిరక్షణకు నూతన వేద పాఠశాల భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హామీ





**వేములవాడ,జులై,25:ప్రజాజ్యోతి.** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ పార్వతీ రాజరాజేశ్వర అఖిల భారత వేద--శాస్త్ర--స్మార్త--ఆగమ విద్వత్ సదస్సు, వేద--స్మార్త పరీక్షా మహోత్సవాలు" ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక వైభవంతో నిర్వహించబడి శనివారం ఘనంగాముగిశాయి జూలై 21న ప్రారంభమైన ఈ మహోత్సవాలు జూలై 25న విజయవంతంగా పూర్తయ్యాయి. వేద సంస్కృతి పరిరక్షణ, వేద విద్యాభివృద్ధి, సనాతన ధర్మ ప్రచారం, భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడలో అఖిల భారత స్థాయిలో వేద పండితులు, వేద విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం విశేషంగా నిలిచింది. దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వేద విద్యార్థులు, వేద పండితులు పాల్గొని వివిధ వేద శాఖలకు సంబంధించిన పరీక్షలు, మంత్ర పారాయణాలు, పుష్పార్చనలు, ఆధ్యాత్మిక చర్చా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ఐదు రోజుల వేద--స్మార్త పరీక్షా మహోత్సవాల్లో మొత్తం 130 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 124 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆరుగురు విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. సుమారు 40 మంది పరీక్షాధికారులు పరీక్షల నిర్వహణలో పాల్గొని పారదర్శకంగా పరీక్షలను నిర్వహించారు. అనుత్తీర్ణులైన (6) ఆరుగురు విద్యార్థులు నిరుత్సాహపడకుండా వచ్చే ఏడాది మరింత కృషి చేసి ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. నాలుగో రోజు పుష్పార్చన కార్యక్రమంమహోత్సవాల నాలుగో రోజు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల సన్నిధిలో వివిధ వేద శాఖలకు చెందిన మంత్రోచ్చారణలతో విశేష పుష్పార్చన (క్రమార్చన) నిర్వహించారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదంతో పాటు వాటి ఉపశాఖలకు సంబంధించిన మంత్రాలను క్రమబద్ధంగా పారాయణం చేస్తూ ప్రపంచ శాంతి, ధర్మ పరిరక్షణ, లోకకళ్యాణం కోసం పుష్పార్చనలు సమర్పించారు. నిర్వహించిన వేద శాఖలుఋగ్వేదంకృష్ణ యజుర్వేదంశుక్ల యజుర్వేదం (కాణ్వ శాఖ, మాధ్యందిన శాఖ)కృష్ణ యజుర్వేదం -- మైత్రాయణి శాఖసామవేదం (కౌథుమ శాఖ, రాణాయణి శాఖ)సామవేదం -- జైమినీయ శాఖఅథర్వవేదం (శౌనక శాఖ, పైప్పలాద శాఖ)స్మార్తం (ఆశ్వలాయన, ఆపస్తంబ సూత్రాలు)వేద అంత్యాక్షరి పోటీలువేదాల విశిష్టతవేదాలు భారతీయ సనాతన ధర్మానికి మూలస్తంభాలుగా భావించబడుతున్నాయి. మానవ జీవితానికి అవసరమైన ధర్మం, యజ్ఞాలు, ఆచారాలు, ప్రకృతి విజ్ఞానం, సంగీతం, ఆధ్యాత్మికత, జీవన విలువలను వేదాలు బోధిస్తాయి. చిన్ననాటి నుంచే 13 నుంచి 14 సంవత్సరాల పాటు కఠోర సాధనతో వేద విద్యార్థులు మంత్రాలను కంఠస్థం చేసి గురుపరంపర ద్వారా వేద విద్యను అభ్యసిస్తారు. వేద పండితులు రాసే పరీక్షలు అత్యంత కఠినమైనవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒక వేద విద్యార్థి గురువు బోధించిన మొదటి రోజు నుంచి నేర్చుకున్న మంత్రాలను, వాటి స్వరాలను సంవత్సరాల తర్వాత కూడా యథాతథంగా చెప్పగలగడం వేద విద్య గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. నూతన వేద, సంస్కృత పా ఠశాల భవనాలఏర్పాటుముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మహోత్సవాలు మరింత విజయవంతంగా నిర్వహించబడినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఈ కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేద విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, వేములవాడలో సుమారు ఐదు ఎకరాల స్థలాన్ని పరిశీలించి అందులో ఒక స్థలాన్ని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆ స్థలంలో నూతన వేద పాఠశాల మరియు సంస్కృత పాఠశాల భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించి వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వేద సంస్కృతి పరిరక్షణకు కట్టుబాటుదేశ నలుమూలల నుంచి వేద పండితులు వేములవాడకు విచ్చేసి పాల్గొనడం గర్వకారణమని పేర్కొన్న ఎమ్మెల్యే, వేద సంస్కృతి పరిరక్షణ కోసం ప్రతి ఏడాది ఈ మహోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి వేదాలతో పాటు మరిన్ని శాస్త్రాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. అనువంశిక అర్చకులకు ప్రాధాన్యంవేములవాడ దేవస్థానంలో అర్చక నియామకాల విషయంలో అనువంశిక అర్చకులకు మొదటి ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నియామక ప్రక్రియలో మొత్తం 191 పోస్టులను భర్తీ చేయగా, వాటిలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, వేములవాడకు 21 పోస్టులు కేటాయించబడ్డాయని వెల్లడించారు. అందులో 10 పోస్టులు అనువంశిక అర్చకులకు లభించాయని తెలిపారు. భవిష్యత్తులో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అర్చక నియామకాలలో వేములవాడకు సంబంధించిన పోస్టులకు స్థానిక అనువంశిక అర్చకులకు తొలి ప్రాధాన్యత కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, వేములవాడలోని 128 అనువంశిక అర్చక కుటుంబాల నుంచి కనీసం ఒక్కో విద్యార్థిని వేద పాఠశాలలో చేర్పించి వేద విద్యను అభ్యసించేలా కుటుంబ సభ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ మహోత్సవాల విజయవంతమైన నిర్వహణకు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల. రేవంత్ రెడ్డి ఆదేశాలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా.సురేఖ ప్రత్యేక చొరవ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఐఏఎస్ మార్గదర్శకత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, ఐఏఎస్ సహకారం ఎంతో కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే, వేద పాఠశాల ప్రిన్సిపాల్ అన్నవరం ఆంజనేయ శర్మ, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి, ఐదు రోజుల పాటు ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు, పరీక్షాధికారులు మరియు భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "వేదో రక్షతి రక్షితః"వేదాలను రక్షించిన వారిని వేదాలే రక్షిస్తాయి. "లోకాః సమస్తాః సుఖినో భవంతు"సమస్త లోకాల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థన. వేద సంస్కృతి పరిరక్షణకు, సనాతన ధర్మ ప్రచారానికి, భావితరాలకు భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించడానికి వేములవాడలో నిర్వహించిన ఈ అఖిల భారత వేద--శాస్త్ర--స్మార్త--ఆగమ విద్వత్ సదస్సు మరియు వేద--స్మార్త పరీక్షా మహోత్సవాలు ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి మరో రూ.99.40 కోట్లు..

## మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరిక నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు..

## గత 2023-24 బడ్జెట్లో 50 కోట్లు,2024-25 బడ్జెట్లో 100 కోట్లు నిధులు విడుదల

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## ఇప్పటికే 45 శాతం పనులు పూర్తిహర్షం వ్యక్తం చేస్తున్న రాజన్న భక్తులు..



**వేములవాడ,జులై.25:ప్రజాజ్యోతి.** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధి, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తాజా నిధుల మంజూరుతో ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరుకున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యంత ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న రాజన్న ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో దశలవారీగా భారీ నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు విడుదల చేయగా, ఇప్పుడు మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరనుందిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిసరాలను ఆధునికీకరించడం, యాత్రికులకు విశాలమైన వసతులు కల్పించడం వంటి లక్ష్యాలతో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సుమారు 45 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారుతాజాగా విడుదలైన నిధులతో మిగిలిన నిర్మాణాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఆలయ పరిసరాల సుందరీకరణ, భక్తుల కోసం అవసరమైన సౌకర్యాల కల్పన వంటి పనులను వేగవంతం చేయనున్నారు. దీంతో వేములవాడ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారుఈ సందర్భంగా నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, శ్రీధర్ బాబు,మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్లకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధిని ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకుని ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారుశృంగేరి పీఠాధిపతుల శ్రీశ్రీశ్రీ విధుశేకర భారతి స్వామి వారిని పలు మార్లు కలిసి రాజన్న ఆలయ అభివృద్ధి పై వారి సలహాలు సూచనలు తీసుకొని ముందుకు వెళ్లడం జరుగుతుంది. త్వరలోనే మరోసారి శృంగేరి వెళ్లి స్వామి వారిని కలసి వారి సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారువేములవాడ రాజన్న ఆలయం తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవంగా నిలిచిందని, ఆలయ విస్తరణ పూర్తయితే ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా పర్యాటక రంగంలోనూ వేములవాడ మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుందని స్థానికులు, భక్తులు అభిప్రాయపడు తున్నారు. భారీ నిధుల విడుదలతో ఆలయ అభివృద్ధి పనులు మరింత వేగవంతమవుతాయని, త్వరలోనే భక్తులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అన్యాయంగా సస్పెండ్ చేసిన దళిత ఎస్ఐ ఎం. చిరంజీవిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

– తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కు కోరుట్ల అంబేద్కర్ యువజన సంఘాల వినతి



**కోరుట్ల జులై 25 ప్రజాజ్యోతి**కోరుట్ల పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దళిత అధికారి ఎం. చిరంజీవి ని ఎలాంటి సమగ్ర విచారణ లేకుండానే సస్పెండ్ చేయడం అన్యాయమని కోరుట్ల నియోజకవర్గ అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను ఆశ్రయించారు.శనివారం కోరుట్ల కు వచ్చిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు చైర్మన్ ను ఘనంగా సన్మానించారు. అనంతరం కోరుట్ల ఎస్సై ఎం చిరంజీవి సస్పెన్షన్ ను ఎత్తివేయాలని వినతి పత్రం సమర్పిం చారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈమధ్యనే మెట్పల్లిలో హత్యకు గురైన కర్రె సునీత కోరుట్ల పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు ఇచ్చిందనే ప్రచారం వాస్తవానికి విరుద్ధమని పేర్కొన్నారు. సునితను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయకుండా కసుల గంగారెడ్డి అడ్డుకున్నారని తెలిపారు. .ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్, రాష్ట్ర నాయకులు బలిజ రాజారెడ్డి, వుయ్యాల నర్సయ్య, ఎమ్మార్పీఎస్ జర్నలిస్టు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చెట్ పల్లి లక్ష్మణ్, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీ నారాయణ, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు ఉయ్యాల శోభన్,మాల మాదిగ కుల సంఘాల నాయకులు పసుల కృష్ణ ప్రసాద్, శనిగారపు రాజేష్, బలిజ రాజ శేఖర్, పసులు చిన్నయ్య, మోర్తాడ్ రాజశేఖర్, సామల్ల వేణు, సత్య ం, నారాయణ తదితర దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ధర్మపురి ఇరిగేషన్ పనులపై మంత్రుల మార్క్: 'నక్కలపేట'కు నూతన లిఫ్ట్.. 'అక్కపల్లి'కి ఆరు నెలల గడువు!

- మంత్రి అడ్లూరి చొరవ.. ప్రతిపాదనలకు మంత్రి ఉత్తమ్ గ్రీన్ సిగ్నల్
- ఆగస్టు 15 లోపు రోళ్లవాగు షట్టర్ల ఏర్పాటు.. 0.25 టీఎంసీల నీటి నిల్వ
- కమిషన్ల కోసం కాదు.. రైతులకు నీరివ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అడ్లూరి



**జగిత్యాల టౌన్, జూలై 25 (ప్రజా జ్యోతి):**
ధర్మపురి నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా మంత్రులు సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. శనివారం హైదరాబాద్లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో ధర్మపురి ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం జరిగింది.

**మంత్రి అడ్లూరి పట్టుదల.. నక్కలపేట లిఫ్ట్కు గ్రీన్ సిగ్నల్:**
నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ నీరందించాలనే పట్టుదలతో, ధర్మపురి మండలంలోని నక్కలపేట గ్రామంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గట్టిగా ప్రతిపాదించారు. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. యుద్ధప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన లిఫ్ట్ ప్రకటనతో ధర్మపురి మండల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

**కాలపరిమితితో పనుల వేగవంతం:**

**రోళ్లవాగు ప్రాజెక్టు:**
జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలంలోని రోళ్ళవాగు ప్రాజెక్టుకు ఆగస్టు 15 లోపు షట్టర్లు బిగించి, 0.25 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని మంత్రి ఉత్తమ్ స్పష్టమైన గడువు విధించారు. కాలువల పూడికతీతకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు.

**అక్కపల్లి లిఫ్ట్:**
ధర్మపురి మండలంలోని అక్కపల్లి లిఫ్ట్ పనులను ఆరు నెలల్లో పూర్తి చేసి, 2027 జనవరి చివరి కల్లా రైతులకు సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు.

**చెరువుల పూడికతీత:**
వెల్గటూర్ జంగల్ నాల ప్రాజెక్టు అభివృద్ధి పనులతో పాటు, గొల్లపల్లి మండలంలోని యశ్వంత్ రావు పేట, రంగధాముని పల్లి చెరువుల పూడికతీత పనులకు తక్షణమే అంచనాలు రూపొందించాలని ఆదేశించారు.

**కమిషన్ల కోసం కాదు.. రైతుల కోసమే: మంత్రి అడ్లూరి**
ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టుల పనులు చేసిందని మండిపడ్డారు. తమ ప్రజా ప్రభుత్వం మాత్రం నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తోందని, ఇచ్చిన మాట ప్రకారం అన్ని ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

# ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండానే ...

# విశాల్ మార్ట్ ప్రారంభమా?

**-జి ప్లస్-4 వాణిజ్య భవనంపై నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలు**
**సెల్లార్‌లో లోపాలు**
**- సెట్‌బ్యాక్‌లపై అభ్యంతరాలు**
**- భవన యజమానికి నోటీసులు జారీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ వెల్లడి దొమ్మటి రాజేష్**




**పెద్దపల్లి ప్రతినిధి జూలై 24 ప్రజా జ్యోతి;** పెద్దపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై నిర్మించిన ఓ జి ప్లస్-4 వాణిజ్య భవనంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) లేకుండానే ప్రముఖ రిటైల్ సంస్థ విశాల్ మార్ట్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయనే అంశం చర్చనీయాంశంగా మారింది. భవన నిర్మాణంలో మున్సిపల్ నిబంధనలు పాటించలేదని, సెల్లార్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని, భవనం చుట్టూ తప్పనిసరిగా ఉండాల్సిన సెట్‌బ్యాక్‌లు లేకుండానే నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై విచారణ చేపట్టి, అవసరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. రాజీవ్ రహదారిని ఆనుకుని కమాన్ నుంచి జెండా చౌరస్తాకు వెళ్లే ప్రధాన మార్గంలో సుమారు 1,558 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, 14.9 మీటర్ల ఎత్తుతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో విశాల్ మార్ట్ ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ అంటే ఏమిటి?**

భవన నిర్మాణం పూర్తయిన తర్వాత, ఆమోదించిన ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణం జరిగిందా లేదా అనే విషయాన్ని మున్సిపల్ అధికారులు పరిశీలించిన అనంతరం జారీ చేసే అధికారిక ధ్రువీకరణ పత్రమే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ నిర్మాణ భద్రత, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, అగ్నిమాపక భద్రత, డ్రైనేజీ, విద్యుత్, నీటి సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించి అన్ని నిబంధనలు పాటించినట్లు నిర్ధారణ అయిన తర్వాతే ఈ సర్టిఫికెట్ జారీ చేస్తారు.సాధారణంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందిన తర్వాతే భవనాన్ని నివాసం లేదా వాణిజ్య కార్యకలాపాల కోసం పూర్తిస్థాయిలో వినియోగించాలి. ఈ ధ్రువీకరణ పత్రం లేకపోతే భవనం పూర్తి స్థాయిలో వినియోగానికి అనుమతి లేనట్లుగా పరిగణించే పరిస్థితులు ఏర్పడవచ్చు.

**సెల్లార్ నిర్మాణంలో నిబంధనలు ఏమంటున్నాయి?**

మున్సిపల్ నిబంధనల ప్రకారం సెల్లార్‌ను ప్రధానంగా వాహనాల పార్కింగ్, ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్, ఫైర్ పంప్ రూమ్, నీటి సంప్ వంటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలి. సెల్లార్‌లో వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా ర్యాంప్, తగిన వెంటిలేషన్, డ్రైనేజీ వ్యవస్థ, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు ఉండాలి. అనుమతించిన నమూనాకు విరుద్ధంగా సెల్లార్ నిర్మించినా లేదా అనుమతి లేని విధంగా వినియోగించినా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**సెట్‌బ్యాక్‌లు ఎందుకు తప్పనిసరి?**

భవనం చుట్టూ నిర్దేశిత ఖాళీ స్థలాన్ని సెట్‌బ్యాక్ అంటారు. ఇది గాలి, వెలుతురు సక్రమంగా అందడానికి, అగ్నిమాపక వాహనాలు భవనం వద్దకు చేరుకోవడానికి, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సురక్షితంగా బయటకు రావడానికి, భవనం నిర్వహణ పనులకు ఎంతో అవసరం. అందుకే మున్సిపల్ బిల్డింగ్ నిబంధనల్లో సెట్‌బ్యాక్‌లకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు.

**ట్రేడ్ లైసెన్స్ పరిధిపై సందేహాలు..!**

స్థానికంగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, జి ప్లస్-1 అంతస్తు, రెండో అంతస్తులో కొంత భాగం వరకు మాత్రమే ట్రేడ్ లైసెన్స్ మంజూరైందని, అయితే జి ప్లస్-4 వరకు వాణిజ్య కార్యకలాపాలకు ఏర్పాట్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై అధికారిక విచారణ అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**ట్రాఫిక్ సమస్యలపై స్థానికుల ఆందోళన**

కమాన్ నుంచి జెండా చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారిపై ఇప్పటికే వాహనాల రద్దీ అధికంగా ఉంటోందని, ఇలాంటి భారీ వాణిజ్య సంస్థ ప్రారంభమైతే వాహనాల రాకపోకలు మరింత పెరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తగిన పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## 'నోటీసులు జారీ చేస్తాం'



ఈ విషయమై పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌ను వివరణ కోరగా, సంబంధిత భవన యజమానికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఆ భవనానికి ఇప్పటివరకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ కాలేదని స్పష్టం చేశారు. సెల్లార్ నిర్మాణంలో లోపాలు, సెట్‌బ్యాక్ అంశాలపై సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికా తో విచారణ చేపట్టాలని ఆదేశిస్తామని పేర్కొన్నారు. విచారణ నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్



